క్లుప్తంగా

నేడు పాఠశాలలకు సెలవు

కురిచేడు: జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో సోమవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు, రెసిడెన్షియల్ పాఠశాలలకు, కళాశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి పిల్లలను బయటకు పంపకూడదని ప్రభుత్వం కోరింది. ఇందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించింది.

గుండ్లకమ్మ చప్టా పరిశీలన

దొనకొండ: మండలంలోని కొచ్చెర్లకోట గ్రామ శివారులోని గుండ్లకమ్మకు ఏర్పాటు చేసిన చప్టాను మండల తహసీల్దార్ బి.రమాదేవి ఆదివారం పరిశీలించారు. అల్ప పీడనం ప్రభావం వలన వాగు వంకలు ప్రవహించే ప్రమాదం ఉందని గుర్తించి ముందు జాగ్రత్తగా ప్రమాదమైన చప్టాలను ఆమె పరిశీలించారు. రెవెన్యూ సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని, గ్రామాల్లో తుఫాన్ ప్రభావం గమనిస్తూ అవాంఛనీయ సంఘటనలు జరిగితే తమకు తెలియజేయాలన్నారు. సిబ్బంది సెలవులకు ఎక్కడికి వెళ్ళకుండా విధులు నిర్వహించే గ్రామాల్లోని ఉండాలని సూచించారు.

చర్చి వందేళ్ల ఉత్సవాలు


త్రిపురాంతకంలో ప్రత్యేక ప్రార్థనలు

త్రిపురాంతకం: ఆంధ్ర లూథరన్ ఇవాంజికల్ చర్చి వంద సంవత్సరాల వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. త్రిపురాంతకంలో ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. 1924 సంవత్సరంలో ఈ చర్చిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెద్దలు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన్‌లోకి ఎస్సీ హాస్టల్ మార్పు


అంబేడ్కర్ భవన్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ వెంకట సునీల్

యర్రగొండపాలెం: స్థానిక మార్కాపురం రోడ్డులో ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్‌ను మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం ఆడిటోరియంలోకి తాత్కాలికంగా మార్చారు. ఎడతెరపిలేని వర్షాలు కురుస్తుండటం వలన శిథిలావస్థకు చేరిన ఎస్సీ హాస్టల్ భవనంలోని కొన్ని గదులు ప్రమాద పరిస్థితుల్లో ఉండటంతో ఈ మార్పు చేయాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. దాదాపు 30 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ భవనంలో విద్యార్థులకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని, ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులను సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు తెలిపారు. తహసీల్దార్ హరిబాబు అంబేడ్కర్ భవన్‌లో బస చేస్తున్న విద్యార్థులతో మాట్లాడారు.

మెట్ట పైర్లు కళకళ


కళకళలాడుతున్న ఆముదం పైరు


కంది పైరు ఇలా..

దొనకొండ:

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది, ఆముదం, పత్తి పంటలకు సకాలంలో వర్షాలు కురవక పోవటంతో ఎండు ముఖం పట్టాయి. తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురవటం వలన పైర్లు కళ కళలాడుతున్నాయి. గ్రామాల్లోని రైతులు ఆనందాన్ని వ్యక్త పరుస్తున్నారు. పంటలకు అల్ప పీడనం చాలా ఉపయోగ పడింది. ప్రధానంగా వాణిజ్య పంటలైన ఆముదం, కంది, పత్తి వర్షానికి కళ కళలాడుతున్నాయి. ఇప్పటి వరకు పొలాలకు ఎరువులు వేయని రైతులు మన గ్రోమోర్, జనతా రైతు బజారులో ఎరువులు విచ్చల విడిగా కొనుగోలు చేస్తున్నారు. అలాగే మిరప నారు కూడా పెరగటంతో నాట్లు వేయటం కోసం రైతులు పొలాలను సిద్ధం చేసి పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలో అన్ని గ్రామాల్లో 4వేల ఎకరాల్లో ఆముదం, 5 వేల ఎకరాల్లో కంది, 8 వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. మిరప 7500 ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేస్తున్నారు.

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీటీఎఫ్ ఉద్యోగులు


రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ ఉద్యోగులు

- కేంద్ర నిర్ణయం ఉద్యోగుల పాలిట శాపం

దర్శి: యునైటెడ్ పెన్షన్ స్కీమ్‌లోకి ప్రతి ఉద్యోగి చేరాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం ఉద్యోగుల పాలిట శాపంగా మారిందని యూటీఎఫ్ దర్శి డివిజన్ కార్యదర్శి ధనిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ వద్దని.. పాత పెన్షన్ విధానం కొనసాగించాలని కోరుతూ దర్శి తహసీల్దార్ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ కేంద్ర నిర్ణయాన్ని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. పెన్షన్ అనేది రాజ్యాంగం కల్పించిన హక్కని ఓపీఎస్ సాధించుకునే వరకు యూటీఎఫ్ పోరాటాలు కొనసాగిస్తుందని చెప్పారు. చవితి తల్లి ప్రేమలను ఉద్యోగుల పట్ల చూపించవద్దని, ఉద్యోగులను బానిసలుగా చిత్రీకరించవద్దని కోరారు. కార్యక్రమంలో దర్శి మండల అధ్యక్షుడు మీనిగ శ్రీను, ప్రధాన కార్యదర్శి పి. ఖాశీం, సహాధ్యక్షుడు ఏ. రామారావు, కోశాధికారి కె. రామారావు, దొనకొండ మండల అధ్యక్షుడు ఎం. వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏ. రోశయ్య, ముండ్లమూరు మాజీ అధ్యక్షుడు ఎస్. తిరుపతిరెడ్డి, కార్యదర్శి దేవవరపు శ్రీనివాసులు, జిల్లా కౌన్సిలర్ టి. చెంచయ్య, సీనియర్ నాయకులు రామిరెడ్డి పాల్గొన్నారు.

దర్శి: సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ విధానాలను రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం ఆదివారం ఈమేరకు నిరసన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వంలో సీపీఎస్ విధానం రూపొందించారని చెప్పారు. అప్పటి వరకు పెన్షన్ తీసుకుంటున్న ఉపాధ్యాయులకు ఇబ్బంది లేకపోయినప్పటికీ ఆ తరువాత చేరిన ఉపాధ్యాయులు ఎంతో మంది ఆందోళన చెందుతున్నారని చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు జేఏసీ, ప్యాప్టో, ఏపీటీఎఫ్ తరపున రాష్ట్రంలో, దేశంలో అనేక ఉద్యమాలు చేపట్టినప్పటికీ సీపీఎస్ విధానాన్ని రద్దు చేయలేదన్నారు. సీపీఎస్‌కు బదులుగా జీపీఎస్ ప్రవేశ పెట్టడం కూడా సమ్మతిగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌డీఏ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన యూపీఎస్ (యూనిఫైడ్ పెన్షన్ సిస్టం) విధానాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. దీనికి నిరసనగా రాష్ట్ర పిలుపు మేరకు సెప్టెంబర్ ఒకటో తేదీ సీపీఎస్ విద్రోహ దినంగా భావిస్తూ రాష్ట్రంలో అన్ని రెవెన్యూ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పెన్షన్ ఉద్యోగులకు భిక్షకాదని హక్కని చెప్పారు. పెన్షన్ లేని ఉద్యోగులు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎస్ రద్దు చేసే వరకు దశల వారీగా ఉద్యమాలు కొనసాగిస్తామని చెప్పారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జోన్ కన్వీనర్ ఎల్‌వీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీహెచ్ శివరామకృష్ణ, రంగస్వామి, కోటేశ్వరరావు, శ్రీనివాసులు, మస్తాన్‌వలి, సుబ్బారెడ్డి, కాజా, రహమ్‌తుల్లా, సుబ్బారావు, రమణయ్య, వేణు, చక్రధర్, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ, కృష్ణ, రాఘవరావు, వెంకటేశ్వర్లు, సాంబయ్య, జాన్, నరసింహం పాల్గొన్నారు.

దర్శి: పాత పెన్షన్ స్కీమ్ మాత్రమే అమలు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ మూర్తి, జిల్లా ఏపీటీఎఫ్ బి. వెంకట్రావు డిమాండ్ చేశారు.


దర్శి: నిరసన తెలుపుతున్న నాయకులు


దర్శి: రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆదివారం సీపీఎస్ విద్రోహ దినంగా నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఉద్యోగులంతా ముక్త కంఠంతో ఓపీఎస్ మాత్రమే కోరుకుంటున్నారని చెప్పారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆకాంక్ష అది తప్ప వేరే ఏస్కీమును అంగీకరించేది లేదని కుండబద్ధలు కొట్టారు. ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకొస్తున్న యూపీఎస్ స్కీమ్‌ను రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ఓల్డ్ పెన్సన్ స్కీమ్ అమలు లోకి తెచ్చే విధంగా ప్రయత్నాలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు గురులింగం, విక్రమ్ నాగార్జున, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, సీనియర్ కార్యకర్తలు బాలాజీరావు, పీరు సాహెబ్, రవీంద్రరావు, నాగరాజు, రంగారావు, రామారావు, సాయిరాం పాల్గొన్నారు.

వైఎస్సార్ వర్ధంతి విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని ఘనంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ కోరారు. నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని, స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో జరిగే వర్ధంతి సభల్లో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

దర్శి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి వేడుకలు విజయవంతం చేయాలని మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. ఉదయం 10.30 గంటలకు దర్శి గడియారం స్తంభం సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తారు. 10.45కు అద్దంకి రోడ్డులోని రెడ్డి కాంప్లెక్స్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తారు. 11.15 గంటలకు దర్శి మండలం రాజంపల్లిలో నూతన వైఎస్సార్ విగ్రహం ఆవిష్కరిస్తారు. మధ్యాహ్నం 12.00కు రాజంపల్లి గ్రామంలో వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం జరుగుతుంది. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్ వర్ధంతి జయప్రదం చేయండి

కురిచేడు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి కార్యక్రమాన్ని మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులంతా జయప్రదం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు నుసుం వెంకట నాగిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బస్టాండు సెంటర్‌లో ఉదయం 9 గంటలకు వర్ధంతి సభ జరుగుతుందని, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పలు విభాగాల నేతలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

యర్రగొండపాలెం: వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కొలుకుల రోడ్డులోని పార్టీ కార్యాలయంలో సభ జరుగుతుందని తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయాల కన్వీనర్లు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

తాళ్లూరు(దర్శి): తాళ్లూరులో జరిగే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి వేడుకలు విజయవంతం చేయాలని మండల కన్వీనర్ తూము వెంకటసుబ్బారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించాలని కోరారు.

గుంటి గంగమ్మకు ప్రత్యేక పూజలు


పూజలో పాల్గొన్న ఎంపీపీ, భక్తులు


పూజలందుకుంటున్న గుంటి గంగా భవాని అమ్మవారు

తాళ్లూరు (దర్శి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవాని అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి తెల్లవారు జామున అభిషేకాలు, అష్టోత్తర శతనామావలి, కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి పొంగళ్లు పొంగించి నివేదన చేశారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో శ్రావణ మాసం ఆఖరి ఆదివారం సందర్భంగా ఆశ్రమంలో వెలసిన పోలేరమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు భక్తులు చేశారు. పోలేరమ్మకు ప్రత్యేక అలంకరణ చేసి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పాల్గొని నైవేద్యాలు, టెంకాయలు కొట్టి మంగళ హారతులు ఇచ్చారు. ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు భైరవానంద స్వామి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ


మాట్లాడుతున్న తహసీల్దార్ రజనీకుమారి


ఎస్సీ హాస్టల్ లో వంటశాలలోని వంటలను పరిశీలిస్తున్న దృశ్యం

కురిచేడు: వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తహసీల్దార్ జి. రజనీ కుమారి ఆదివారం హాస్టళ్లను, గురుకుల పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక కేజీబీవీ, బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, ఎస్సీ, బీసీ హాస్టళ్లను ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమ్యలు అడిగి తెలుసుకున్నారు. ఆహార నాణ్యతను కిచెన్‌లోకి వెళ్లి తనిఖీ చేశారు. రోజు వారి మెనూ గురించి విద్యార్థులు భోజనం చేసే సమయంలో అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించి సూచించారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం గురించి అవగాహన కలిగించారు. ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే తనకు తెలియజేయాలన్నారు. వీఆర్వోలు సరోజిని, ఆంజనేయులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టాలి


మాట్లాడుతున్న తిండి నారాయణ రెడ్డి

దర్శి: భారీ సంఖ్యలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తిండి నారాయణరెడ్డి కోరారు. దర్శి పట్టణంలో పట్టణ అధ్యక్షుడు అచ్యుత గురవార్జున రావు అధ్యక్షతన బీజేపీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా తిండి నారాయణ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరూ తప్పని సరిగా అధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేయాలని కోరారు. అసెంబ్లీ కన్వీనర్ మాడపాకుల శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి నాయకుడు, కార్యకర్త సభ్యత్వాల నమోదు చేయడమే కాకుండా వారికి ఎటువంటి అవసరాలు వచ్చినా.. అంతా కలిసి కట్టుగా అండగా నిలబడాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సభ్యత్వం ఇన్‌చార్జ్ కణితి నాగభూషణాచారి, చెరుకూరి అనీల్‌కుమార్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వి. అమరేశ్వరరావు, మదీనా గౌసాని, అర్షద్, లోకేష్, సీనియర్ నాయకులు అరికట్ల నారాయణరెడ్డి, కె. మురళి తదితరులు పాల్గొన్నారు.

చిన్నకండ్లేరుకు భారీగా చేరిన వరద నీరు


చిన్నకండ్లేరు ప్రాజెక్టులోకి భారీగా చేరిన వరదనీరు


చెరువు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్

- ప్రాజెక్టు భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతాంగం
- పరిస్థితి సమీక్షించిన సబ్ కలెక్టర్

పుల్లలచెరువు: గత రెండు రోజుల నుంచి కురిసిన వర్షాలకు పుల్లలచెరువు సమీపంలో ఉన్న చిన్నకండ్లేరు ప్రాజెక్టుకు సుమారు 20 అడుగల మేరకు వరద నీరు చేరింది. ఈ ప్రాజెక్టు కింద 2000 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. గతంలో ప్రాజెక్టు లో భారీగా నీరు చేరడంతో కట్ట దగ్గర రంధ్రం పడింది. దీంతో నీరు బయటకు రావడంతో అప్పటి మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆదేశాలపై అధికారులతో మాట్లాడి మంత్రి దగ్గర ఉండి రంధ్రాన్ని పూడ్చి వేశారు. ఆ తరువాత మరలా ఇప్పుడు చెరువులోకి నీరు చేరడంతో మట్టి జారిపోతూ ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆ ప్రాంత రైతులు ఆందోళనచెందుతున్నారు. దీనిపై అధికారులకు సమాచారం ఇవ్వడంతో మార్కాపురం ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ వెంకటసునీల్ ఆదివారం చిన్నకండ్లేరు ప్రాజెక్టును సందర్శించారు. దీనిపై అక్కడ ఉన్న రైతులతో ఆయన మాట్లాడారు. రైతులు మాట్లాడుతూ పై నుంచి చెరువులోకి భారీగా నీరు చేరుతోందని, గతంలో రంధ్రం వద్ద పోసిన మట్టి దిగజారిందని, మళ్లీ గండి పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లతానని, ముందుస్తు చర్యలు చేపడతామని తెలిపారు. కాగా చిన్నకండ్లేరు ప్రాజెక్టు భద్రతపై ఆ ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఈ ప్రాజెక్టు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కానీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రాజెక్టు దీన స్థితికి చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టు కట్ట మొత్తం తుమ్మ చెట్లతో నిండిపోయింది. దీంతో కట్ట భద్రత ఎంతవరకు ఉంటుందో అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లోతట్టు ప్రాంతాల్లో పంటలు జాగ్రత్త

తాళ్లూరు (దర్శి): లోతట్టు ప్రాంతాల పంటల్లో జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ ప్రసాద్‌రావు సూచించారు. మండలంలోని పలు గ్రామాలు పర్యటించి లోతట్టు పొలాల్లో పైర్లకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈసందర్భంగా ప్రసాద్‌రావు మాట్లాడుతూ మండలంలో 2552 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, కంది, సజ్జ వంటి పంటలు సాగు చేశారన్నారు. మండలంలో 94.8 సెంటీమీటర్ల వర్ష పాతం నమోదు అయిందని తెలిపారు. 803 ఎకరాల్లో మొక్క జొన్న వివిధ దశల్లో ఉందని పొలాల్లో నీరు నిలచి ఉంటే వెంటనే బయటకు పంపాలని చెప్పారు. ఎకరాకు 25 కిలోల యూరియా, 10కిలోల పోటాష్ ఎరువులను పై పాటుగా వేయాలన్నారు. వరి 949 ఎకరాల్లో సాగు చేశారని చెప్పారు. ఎకరాకు 30 కిలోలు యూరియా, 15కిలోలు పోటాష్ ఎరువులను పై పాటుగా వేయాన్నారు. కంది 593 కరాల్లో సాగు చేశారని వర్షం నీరు నిలవకుండా బయటకు పంపాలని చెప్పారు. మూడు గ్రాములు కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలని సూచించారు. సజ్జ 200 ఎకరాల్లో సాగు చేశామని రైతులు వ్యవసాయ శాఖ ద్వారా అందుతున్న సలహాలు సూచనలు పాటించాలని తెలపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నారుమళ్ల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోండి

త్రిపురాంతకం: తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రైతులు అప్రమత్తంగా ఉండాలని, నారు మళ్ల జాగ్రత్తగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కె. నీరజ తెలిపారు. త్రిపురాంతకం మండలంలోని దూపాడు, గొల్లపల్లి గ్రామాల్లోని పంట పొలాలను ఆదివారం పరిశీలించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇప్పటి వరకు పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదన్నారు. బెట్టమీదున్న మెట్టపైర్లకు ఈవర్షం కొంత వరకు ఊరట కలిగించిందని తెలిపారు. రైతులు వరి, పొగాకు, మిరప నార్లు, నాట్లు జరుగుతున్నందున రైతులు నీరు నిలబడకుండా చూసుకోవాలని కోరారు.


చిన్నకండ్లేరు ప్రాజెక్టు కట్ట


క్షేత్ర పరిశీలన చేస్తున్న ఏఓ నీరజ


మొక్కజొన్న పంట పరిశీలిస్తున్న ఏఓ ప్రసాద్‌రావు

నిధులు మంజూరు కాగానే పనులు

- ఈఈ పూర్ణచంద్ వెల్లడి

సాక్షి ఎఫెక్ట్..

కురిచేడు: నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువ, దర్శి, పమిడిపాడు బ్రాంచి కాలువల పరిధిలో చెట్ల తొలగింపు, పూడిక తొలగింపు, గండ్లు పూడ్చేందుకు ప్రభుత్వానికి అంచనాలు పంపించామని దర్శి ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బి. పూర్ణచంద్ ఆదివారం తెలిపారు. దీనికి రూ. 4.37 కోట్లు అవసరమవుతాయన్నారు. ఆదివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ఇలా..ఎలా..? అన్న శీర్షికన ప్రచురితమైన వార్తకు ఆయన వివరణ ఇచ్చారు. తమ పరిధిలో సిబ్బంది కొరత ఉన్న విషయం వాస్తవమని, 115 మంది లస్కర్లకు గాను 14 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. 24 మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లకు గాను 7 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. అయితే కాలువ కట్టలపై ఉన్న కంపచెట్లను, గండ్లను కొంతమేర తొలగించామని తెలిపారు. నివేదిక సమర్పించాలని సంబంధిత ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లను కోరినట్లు తెలిపారు. క్షేత్రస్థాయి నివేదిక అందగానే నిర్మాణాల మరమ్మత్తుల అంచనాలను తయారు చేసి పరిపాలనా విభాగానికి ఆమోదం కోసం ఉన్నతాధికారులకు పంపి మంజూరైన వెంటనే పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

కేజీబీవీలో పారిశుద్ధ్య చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

పెద్దారవీడ: మండల కేంద్రం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం అవరణంలో ఉన్న మురుగు నీటి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆదివారం పరిశీలించారు. సాక్షి దినపత్రికలో వచ్చిన కేజీబీవీలో పడకేసిన పారిశుద్ధ్యం అనే వార్తకు ఆదివారం స్పందన లభించింది. స్థానిక ఆరోగ్య కేంద్రం డాక్టర్, కార్యకర్తలు సందర్శించారు. డాక్టర్ రవి ఆధ్వర్యంలో బాలికలకు వైద్య పరీక్షలు చేసిన అనంతరం మందులను పంపిణీ చేశారు. వంట గది, వాషింగ్ చేసే ప్రదేశాల్లో నీరు నిల్వ ఉంటుందని పేర్కొన్నారు. మురుగునీటిపై బ్లీచింగ్ చల్లించారు. బాలికల ఎలాంటి జ్వరాలు సోకుతున్నాయని స్థానికంగా పని చేస్తున్న ఏఎన్ఎం అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కార్యకర్త విజయలక్ష్మి, ఆశ కార్యకర్త వై. రాణి ఉన్నారు.


కేజీబీవీలో పారిశుద్ధ్యం పరిశీలిస్తున్న స్థానిక ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది